క్లుప్తంగా

మార్కెట్ కమిటీ ఛైర్మన్‌కు సన్మానం



మదనాపురం: దేవరకద్ర మార్కెట్ ఛైర్మన్ కతలప్పను శనివారం మదనాపురం మండల కాంగ్రెస్ నాయకులు ఆయన స్వగృహంలో కలిసి మార్యాద పూర్వకంగా పూలమాల శాలువాతో సన్మానించారు. రానున్న రోజుల్లో మరిన్ని పదవులు అవరోహించాలని కోరారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రసిడెంట్ వడ్డె కృష్ణ, మాజీ ఎంపీపీ మహదేవన్‌గౌడ్, మార్కెట్ డైరెక్టర్ విజయ్, నాయకులు సాయిబాబా, శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన డా.కేతూరి



పాన్‌గల్: మండల వాసీ, ఏఐసీసీ జాతీయ ఓబీసీ కో ఆర్డినేటర్ డా.కేతూరి వెంకటేష్ శనివారం హైదరాబాద్‌లో గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడును కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ పనితీరు, స్థానిక ఎన్నికలల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఆయన సూచించినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావానికి తరలిన నాయకులు

పెబ్బేరు రూరల్: విశ్వ హిందు పరిషత్ ఆంధ్రప్రదేశ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించబోయే హైందవ శంఖారావం కార్యక్రమానికి శనివారం పెబ్బేరు మండల హిందూ జాగృత సభ్యులు తరలివెళ్లారు. హిందు దేవాలయాలపై జరిగే అక్రమ దాడులను, హిందు దేవాలయాల రక్షణ కోసం విజయవాడ గన్నవరం దగ్గర భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వేణు, వేమారెడ్డి, దిలీప్‌రెడ్డి, అరవింద్, రఘు, హిమవంతు, సత్యనందర్‌రెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.


మదర్సా వార్షికోత్సవానికి తరలిరండి

ఆత్మకూర్: ఆత్మకూర్ పట్టణంలోని మదర్సా ఇమాదుల్ ఉలూం(అరబ్బీపాఠశాల) 24వ వార్షికోత్సవం ఈనెల 14న సాయంత్రం 6 గంటలకు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపల్ హాఫీజ్ జియాఉర్ రహ్మాన్, హెడ్‌మాస్టర్ హాఫీస్ రఫియొద్దీన్ తెలిపారు. శనివారం పాఠశాలలో వార్షికోత్సవానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఇక్కడ దివ్యఖురాన్ పఠనం పూర్తిచేసిన విద్యార్థులకు సన్మానం నిర్వహిస్తారన్నారు. ఈ సందర్భంగా మహ్మద్ ప్రవక్త దివ్యసూక్తులను తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల అరబిక్ పాఠశాలల అధ్యక్షులు మౌలానా జమాలుర్ రహ్మాన్‌తోపాటు ప్రముఖ మౌలానాలు, ప్రసంగీకులు దైవ సందేశమిస్తారని తెలిపారు. ముస్లింలు పెద్ద ఎత్తున కార్యక్రమానికి తరలి రావాలని వారు కోరారు. కార్యక్రమంలో రహ్మతుల్లా, మౌలానా ముక్తార్, ఖాజా, మాలిక్, సల్మాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తి: విద్యావంతులైన మైనార్టీ యువతకు రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గ్రూప్-1, 2, 3, 4, ఆర్‌ఆర్‌బీ, ఎస్‌ఎస్‌సీ, బ్యాంకింగ్ ఉద్యోగాల కోసం నాలుగు నెలల ఉచిత ఫౌండేషన్ కోర్సు శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి డి.సుబ్రమణ్యం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన మైనార్టీలు (ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, జైన్, బుద్దీస్ట్) నిరుద్యోగ యువత అవసరమైన ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలు దరఖాస్తుకు జతచేసి ఈ నెల 17లోగా కలెక్టరేట్‌లోని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్‌నంబర్ 08545-232500 కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని సూచించారు.

వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు



ఈశ్వరయ్య(ఫైల్)

కొత్తకోట రూరల్: మండలంలోని కనిమెట్ట గ్రామానికి చెందిన వాకిటి ఈశ్వరయ్య(55) ఈనెల 2న ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు బంధువుల ఇంట్లో, చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా సమాచారం దొరకపోవడంతో ఈశ్వరయ్య తమ్ముడు మన్యంకొండ శనివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పుట్టుకతోనే దివ్యాంగుడైన ఈశ్వరయ్యకు వివాహం కాలేదు. తమ్ముడైన మన్యంకొండ ఇంట్లోనే ఉండేవాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వైభవంగా వెంకన్న బ్రహ్మోత్సవాలు

- మక్తల్ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు



కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు, బ్రహ్మోత్సవ పూజలో పాల్గొన్న భక్తులు

ఆత్మకూర్: ఆత్మకూర్ శివారులోని మల్లాపురం క్షేత్రంలో వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా నిర్వహించారు. శనివారం ఉదయం నుంచి రాత్రిదాక ప్రముఖ వేదపండితులు వెంకటశేషశర్మ, సుబ్రమణ్యస్వామిల ఆధ్వర్యంలో స్వామివారికి కల్యాణోత్సవం, రథోత్సవం, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం స్వామివారికి చక్రస్నానం, సుబ్రమణ్య, అయ్యప్ప మూర్తులకు అభిషేకం నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలకు తరలివచ్చిన భక్తులకు అన్నదానం, తీర్థప్రసాదాలు అందజేశారు.

మక్తల్ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు..

వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం సందర్భంగా మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి, లలిత దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు గుడికి రావాలంటే రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని, సౌకర్యాలను సమకూర్చాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. గుడి అభివృద్ధికి, రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు రహ్మతుల్లా, పరమేష్, తులసీరాజ్, మణివర్ధన్ రెడ్డి, నాగేష్, ఎస్టీడీ శ్రీను, భక్తులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

అమరచింత: మహిళలు ఆర్థికంగా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా రుణాలు అందించి ఆదుకుంటోందని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మండల కేంద్రంలో శనివారం ప్రధాని ఎంప్లాయిమెంట్ జనరల్ ప్రోగ్రాం ద్వారా మత్స్యకారులకు మంజూరైన చేపవంటకాల మొబైల్ వాహనాన్ని లబ్ధిదారురాలు సత్యమ్మకు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా డ్వాక్రా, పొదుపు సంఘాలలో సభ్యులకు ఉపాధి రంగాల్లో రాణిస్తున్న వారికి మరింత చేయూత ఇచ్చేందుకు ఒక్కొక్క యూనిట్ 10 లక్షల విలువతో రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. వీటిలో సబ్సిడీ ద్వారా రూ.6 లక్షలు అందుతున్నాయని మిగిలిన రూ.4 లక్షలు లబ్ధిదారులకు బ్యాంకు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. మత్స్యకారులను ఆదుకునేందుకు ఇలాంటి అవకాశంతో మొబైల్ వాహనం అందించడం సంతోషంగా ఉందన్నారు. ప్రస్తుత కాలంలో చేప వంటకాలను ఆదరణ ఉందని, ప్రభుత్వ ప్రోత్సాహంతో తమ వ్యాపారం అభివృద్ధి చేసుకుంటూ కుటుంబానికి అండగా నిలవాలని కోరారు. ఇందిరా మహిళా శక్తి ద్వారా పొదుపు మహిళలకు వారి బ్యాంకు లావాదేవీలు, వ్యాపారాల ఆధారంగా రుణాలను ఇవ్వడానికి ప్రభుత్వం ప్రణాళికా సిద్ధం చేసిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, ఏపీఎం శ్రీనివాసులు, మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు వెంకటమ్మ, పలువురు పాల్గొన్నారు.

పౌష్టికాహారం సక్రమంగా అందించాలి



వివరాల నమోదును ఆన్‌లైన్‌లో పరిశీలిస్తున్న ఇన్‌చార్జి సీడీపీఓ బాలీశ్వరమ్మ

పాన్‌గల్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు, బాలింతలు, గర్భిణులకు అందించే పౌష్టికాహారం సక్రమంగా అందించాలని ఇన్‌చార్జి సీడీపీఓ బాలీశ్వరమ్మ అన్నారు. శనివారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె సందర్శించి పలు రికార్డులు, అందుతున్న పౌష్టికాహారంను పరిశీలించారు. కేంద్రాలకు వచ్చే చిన్నారుల సంఖ్యను పెంచేలా చూడాలన్నారు. పౌష్టికాహారం పంపిణీ, చిన్నారుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆమె అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. పౌష్టికాహారం పంపిణీ, కేంద్రాల నిర్వహణ, వివరాల ఆన్‌లైన్ నమోదులో అలసత్వం వహించే అంగన్‌వాడీ కార్యకర్తలపై చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షాహీన్‌బేగం, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సాంఘిక శాస్త్ర ప్రతిభా పరీక్షలో మెరిసిన విద్యార్థి



కొత్తకోట: రాష్ట్ర సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ స్వచ్ఛంద సంస్థ వారు నిర్వహించిన జిల్లాస్థాయి సాంఘిక శాస్త్ర ప్రతిభా పాటవ పరీక్ష శనివారం జిల్లా కేంద్రంలోని స్పోర్ట్స్ మైదానంలో నిర్వహించారు. కొత్తకోట బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థిని ఎస్.వైష్ణవి అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జిల్లాలో ద్వితీయ స్థానం సాధించడంతో పాటు రాష్ట్రస్థాయి పరీక్షలకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయురాలు నిర్మలాదేవి తెలిపారు. ఎస్.వైష్ణవికి నిర్వాహకులు సర్టిఫికెట్‌తో పాటు రూ.2వేల నగదు అందజేశారు. ఈనెల 21న రాష్ట్రస్థాయి పరీక్షల్లో వైష్ణవి పాల్గొంటుందని తెలిపారు. గైడ్ టీచర్ మునీంద్రమ్మను, వైష్ణవిని డీసీఈబీ కార్యదర్శి చంద్రశేఖర్, ఏఎంఓ మహానంది, సాంఘిక ఉపాధ్యాయురాలు రాజ్యలక్ష్మీ, హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

పేద విద్యార్థులకు అండగా ఉంటాం



పాన్‌గల్‌లో రెడ్డి సేవాసమితి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న రెడ్డి సేవాసమితి నాయకులు

పాన్‌గల్: విద్య, వైద్య పరంగా రెడ్డి సామాజిక వర్గంతో పాటు పేద విద్యార్థులకు అండగా ఉంటూ సహాయం అందిస్తామని రెడ్డి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు తలకంటి నారాయణరెడ్డి, మండల సంఘం అధ్యక్షులు ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంకాలం మండల కేంద్రంలోని రెడ్డి కమ్యూనిటీ హాల్లో రెడ్డి సేవాసమితి నూతన సంవత్సర క్యాలెండర్‌ను సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. రెడ్డి సేవాసమితి ఆధ్వర్యంలో సంఘం అభివృద్ధికి ఐకమత్యంతో పనిచేయాలన్నారు. జిల్లాలోనే మండల కేంద్రంలో రెడ్డి కమ్యూనిటీ హాల్ నిర్మించడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో మోహన్‌రెడ్డి, మేర్వారెడ్డి, బండివెంకట్‌రెడ్డి, నర్సింహారెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, అచ్యుతారెడ్డి, దేవిరెడ్డి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహం



విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్న ఎంఈఓ

అమరచింత: విద్యలో ప్రతిభ కనపర్చి మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు పాఠశాల పూర్వవిద్యార్థి రిటైర్డ్ బ్యాంకు చీఫ్ మేనేజర్ గుడిహల వెంకటనాథం నగదు ప్రోత్సాహకాలు శనివారం విద్యార్థులకు అందించారు. పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థి మూడేళ్లుగా తన తల్లిదండ్రులు గుడిహల రంగాచార్యులు-కనకమ్మ జ్ఞాపకార్థం 8,9,10 తరగతుల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నారని ఆ పాఠశాల జీహెచ్‌ఎం కృష్ణవేణి తెలిపారు. 2023-24 వార్షిక పరీక్షలో ప్రతిభ కనపర్చిన విద్యార్థులు ఆరుగురికి ఒకొక్కరికి 10వేలు, ఎనిమిది వేల చొప్పున అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ భాస్కర్ సింగ్, బాలికల పాఠశాల జీహెచ్‌ఎం కరుణాకర్, ఉపాధ్యాయులు అగ్రిప్ప, దోమ శ్రీనివాసులు, వైడూర్య, అనురాధ, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ నాగభూషణం గౌడ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే



పాన్‌గల్ మండలం చిక్కేపల్లిలో సర్వే వివరాలను నమోదు చేస్తున్న కార్యదర్శి

పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామ పంచాయతీలలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతోందని ఎంపీడీఓ గోవింద్‌రావు శనివారం పేర్కొన్నారు. మండలంలోని 28 గ్రామాల సర్వే వివరాలను పంచాయతీ కార్యదర్శులు మొబైల్ యాప్‌లో నమోదు చేస్తున్నారని, ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా వివరాలను నమోదు చేస్తున్నారన్నారు. మండలంలో ఇప్పటికి 86 శాతం సర్వే పూర్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

అంబులెన్స్‌లో వసతులు కల్పించాలి

వీపనగండ్ల: మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు శనివారం జిల్లా కేంద్రం నుంచి కేటాయించిన అంబులెన్స్‌లో అన్ని వసతులను కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు. గతంలో ఆస్పత్రి ఆవరణలో ఉన్న అంబులెన్స్‌కు రోగులే డీజిల్ పోసుకొని వెళ్లే పరిస్థితి ఉండేదని, దీంతో పలువురు రోగులు పలుమార్లు ఇబ్బందులకు గురయ్యారు. వీపనగండ్ల కమ్యూనిటీ సెంటర్‌కు కేటాయించి, ఆ తర్వాత చిన్నంబావి, శ్రీరంగాపురం మండలాలకు కొత్త అంబులెన్స్‌లు పంపిన అధికారులు వీపనగండ్లకు మాత్రం పంపలేదు. ఈ విషయమై మండలంలోని ప్రజాప్రతినిధులు, ప్రజలు తమకు అంబులెన్స్ వాహనాన్ని కేటాయించాలని కోరగా, జిల్లా కేంద్రంలో ఉన్న పాత వాహనాన్ని రిపేర్ చేయించి వీపనగండ్లకు పంపించారు. పంపించిన వాహనంలో అయిన అన్ని వసతులు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఆలయ నిర్మాణానికి సహకరించండి



ఆలయ నిర్మాణానికి చర్చలు నిర్వహిస్తున్న నిర్వాహకులు

ఆత్మకూర్: పట్టణంలోని రాజవీధిలో పెద్దమ్మతల్లి ఆలయ పునర్నిర్మానానికి ప్రతి ఒక్కరు సహకరించాలని నిర్వాహకులు కోరారు. శనివారం వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్థానికులు, నిర్వాహకులు సమావేశమయ్యారు. ఈసందర్భంగా తిరుపతి నుంచి స్తపతి శిల్పులు అనుమేష్, వెంకటేశ్వరశర్మ హాజరై నిర్మాణ అంచనాలు తదితర విషయాలపై చర్చించారు. ఆదివారం వివరాలను సేకరించారు. వందల ఏళ్లక్రితం నిర్మించిన పెద్దమ్మ గుడి పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో పునర్నిర్మాణానికి రూ.1.50 కోట్లు అవసరమని అంచనా వేశారు. భక్తులు విరాళాలు అందించి సహకరించాలని కోరుతున్నారు. మాజీఎంపీపీ డాక్టర్ శ్రీధర్‌గౌడ్, అశ్విన్‌కుమార్, రవియాదవ్, కుర్నిరవికాంత్, బంగారు భాస్కర్, సత్యం, నాగేష్, రజనీకాంత్ ఉన్నారు.

దివ్యాంగురాలికి ట్రై మోటార్ సైకిల్ పంపిణీ

చిన్నంబావి: మండలంలోని లక్ష్మీపల్లి గ్రామానికి చెందిన మానపాడు శ్రీదేవి కాళ్లు సరిగా లేకపోవడంతో ఆమెను చూసి చలించిపోయిన మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణప్రసాద్ యాదవ్ తన మిత్రుడు రేమొద్దుల ఖతాల్ సహకారంతో మూడు చక్రాల మోటార్ సైకిల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీదేవి తండ్రి అనారోగ్యంతో మృతి చెందగా, సోదరుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు తెలిపారు. ఆమె తల్లితో కలిసి గ్రామంలో జీవనం సాగిస్తుందన్నారు. ఆయన పరిస్థితిని చూసి సహాయం చేసేందుకు ముందుకు వచ్చిన కృష్ణప్రసాద్‌కు, ఖతాల్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీచుపల్లి యాదవ్, బిచ్చన్న, భాస్కర్ యాదవ్, నీలయ్య యాదవ్, సత్యానారాయణ, వెంకట్ రాముడు, కృష్ణయ్య, మద్దిలేటి, భాస్కర్ పాల్గొన్నారు.

సహ చట్టంపై అధికార్ల పేర్లు ఏది?

అమరచింత: తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సహచట్టం సూచిక బోర్డుపై అధికారుల పేర్లను రాయకపోవడంతో కార్యాలయంలో ఉన్నత అధికారి ఎవరో సమాచారం ఎవరిని అడగాలో అర్థం కావడం లేదని మండల ప్రజలు పేర్కొంటున్నారు. ప్రభుత్వం 2005లో ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు అడిగిన సమాచారం ఇచ్చేందుకు వీలుగా సహచట్టం అమల్లోకి తీసుకొచ్చింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా సూచిక బోర్డులలో సైతం అధికారుల పేర్లు కనుమరుగవుతున్నాయి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గోపాల్‌పేట: రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొని ఇద్దరికి గాయాలైన సంఘటన శనివారం మండలంలోని నర్సింగాయపల్లి సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. తాడిపర్తి గ్రామానికి చెందిన ఓ యువకుడు చిట్యాలకు చెందిన మరో యువకుడు కలిసి వనపర్తి వైపు నుంచి తాడిపర్తికి వెళ్తున్నారు. అదే సమయంలో తాడిపర్తి నుంచి ఆటో వనపర్తి వైపు వెళ్తుండగా, నర్సింగాయపల్లి స్టేజీవద్ద రాత్రి ఏడు గంటల ప్రాంతంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో బైకుపై ఉన్న వ్యక్తి, మరో వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా, స్థానికులు గుర్తించి వారిని వనపర్తి ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకునేలోపే క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ఇదే విషయం గోపాల్‌పేట ఎస్సైని వివరణ కోరగా ప్రాథమిక వివరాలు సేకరించామని పూర్తి వివరాలు సేకరించి తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. గాయపడిన ఇద్దరు యువకుల పరిస్థితి విషమంగా ఉందని తెలిసింది.

విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన



పామిరెడ్డిపల్లి శివారులో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సరస్వతి

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామ శివారులో సర్వే నంబర్ 146లో నూతనంగా ఏర్పాటు చేయనున్న విద్యుత్ సబ్‌స్టేషన్ కోసం శనివారం తహసీల్దార్ సరస్వతి స్థలాన్ని పరిశీలించారు. కలెక్టర్ ఆదేశానుసారం విద్యుత్ సబ్‌స్టేషన్ కోసం స్థలాన్ని పరిశీలించడం జరిగిందని, పూర్తి స్థాయి నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఆమెతో పాటు ఆర్‌ఐ గణేష్, సర్వేయర్, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసి యాదవ సంఘం నాయకులు



దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న యాదవ సంఘం నాయకులు

కొత్తకోట రూరల్: దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డిని యాదవ సంఘం నాయకులు, కాంగ్రెస్ నాయకులు శనివారం దమగ్నాపురంలోని ఆయన నివాసంలో కలిశారు. ప్రధాన రోడ్డు నుంచి శ్రీకృష్ణ ఆలయం వరకు సీసీ రోడ్డు వేసేందుకు నిధులు మంజూరు చేయాలంటూ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. సీసీరోడ్డు ఏర్పాటుకు నిధులు కావాలని అడిగిన వెంటనే సానుకూలంగా ఎమ్మెల్యే స్పందించారు. త్వరలోనే నిధులు మంజూరు చేయించి తానే స్వయంగా భూమి చేస్తానని ఎమ్మెల్యే చెప్పినట్టు వారు పేర్కొన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పి.కృష్ణారెడ్డి, ఎన్‌జె.బోయేజ్, డాక్టర్ పీజే.బాబు, యాదవ సంఘం నాయకులు సత్యం యాదవ్, తిమ్మన్నయాదవ్, లక్ష్మయ్యయాదవ్, బాలకొండయ్యయాదవ్, కొండయాదవ్, రాములు యాదవ్, పెంటన్నయాదవ్, శంకర్‌యాదవ్, బాలరాజుయాదవ్, యుగంధర్‌యాదవ్ ఉన్నారు.

మున్సిపల్ కార్మికులను క్రమబద్ధీకరించాలి



రిలే దీక్షలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ ప్రతినిధి, మాజీ కౌన్సిలర్ ఉంగ్లం తిరుమల్

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ కార్మికులను తక్షణమే క్రమబద్ధీకరించాలని బీఆర్‌ఎస్ జిల్లా ప్రతినిధి, మాజీ కౌన్సిలర్ ఉంగ్లం తిరుమల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అవుట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యూలరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు, ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం నుంచి రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్మికులు చేస్తున్న రిలే దీక్షకు మద్దతు ప్రకటించి మాజీ కౌన్సిలర్ ఉంగ్ల తిరుమల్ మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అవుట్ సోర్సింగ్ కార్మికులకు ప్రతినెల క్రమం తప్పకుండా వేతనాలు చెల్లించేవారమని, కనీసం వేతనాలు చెల్లించలేని స్థితిలో మున్సిపాలిటీ ఉందని దుయ్యబట్టారు. కార్మికుల పక్షాన బీఆర్‌ఎస్ పార్టీ పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కౌన్సిలర్ నాగన్నయాదవ్, కార్మికులు కుర్మయ్య, బాలు, యాదగిరి, వెంకటమ్మ, రాణి, గోపాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

నీటిఎద్దడి నివారణకు చర్యలు



జిల్లా కేంద్రంలోని 28వ వార్డులో బోరుబావిని వేయిస్తున్న చీర్ల విజయచందర్, సతీష్

వనపర్తి టౌన్: వనపర్తిలో తాగునీటి కొరతను తీర్చేందుకు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కృతనిశ్చయంతో ముందుకు వెళ్తున్నారని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయచందర్ అన్నారు. 28వ వార్డులో నీటి కొరత ఉండటంతో కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా చైర్మన్ కోట్ల రవి విజ్ఞప్తి మేరకు శనివారం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి వెంగళరావు కాలనీలో మంచినీటి బోరుబావిని వేయించారు. ఈ సందర్భంగా చీర్ల విజయచందర్ మాట్లాడుతూ ప్రజా అవసరాల నిమిత్తం ఎమ్మెల్యే మేఘారెడ్డి అవసరమైన చోట బోరుబావులను వేయిస్తున్నారన్నారు. 19వ వార్డులో శాంతమ్మ మృతి చెందడంతో ఎమ్మెల్యే అభయహస్తం కింద రూ.5వేలు కౌన్సిలర్ చంద్రకళ, కాంగ్రెస్ నాయకులు ఎల్‌ఐసీ కృష్ణ, సోషల్ మీడియా కో ఆర్డినేటర్ వెంకటేష్‌లు బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో లక్కాకుల సతీష్, నక్క రాములు, కృష్ణబాబు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

108 సేవలను వినియోగించుకోవాలి

గోపాల్‌పేట: గోపాల్‌పేట, రేవల్లి, ఏదుల మండలాల ప్రజలు 108 వాహన సేవలను వినియోగించుకోవాలని జిల్లా ప్రోగ్రాం మేనేజర్ రవికుమార్ అన్నారు. శనివారం రేవల్లిలోని సీహెచ్‌సీని సందర్శించి రోగులతో మాట్లాడారు. ఆరోగ్యపరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే 108 నంబర్‌కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆయన వెంట జిల్లా మేనేజర్ రత్నమయ్య, పైలెట్ కిరణ్‌కుమార్‌చారి, ఈఎంటీ జయప్రకాశ్ ఉన్నారు.

విద్యార్థులకు నోటుపుస్తకాల పంపిణీ

అమరచింత: దేశాయి ప్రకాష్‌రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం పాంరెడ్డిపల్లె ప్రాథమిక, అంగన్‌వాడీ కేంద్రాలలో విద్యార్థులకు నోటుపుస్తకాలు, పలకలు, జామెటరీ బాక్సులు పంపిణీ చేసినట్లు ఆ సంస్థ అధ్యక్షుడు సయ్యద్ కలాంపాషా తెలిపారు. ప్రతి సంవత్సరం దేశాయి ప్రకాష్ రెడ్డి పుట్టిన రోజును పురష్కరించుకుని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోటుపుస్తకాలు, పలకలు, స్టేషనరీలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు కార్పొరేట్ విద్యార్థులకు దీటుగా చదువుతూ తమ తల్లిదండ్రులకు, గ్రామానికి పేరు ప్రతిష్టతలు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వెంకటయ్య, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్వరాల నర్సరీకి కంచె ఏర్పాటు

వీపనగండ్ల: మండలంలోని కల్వరాల్ల గ్రామంలోని కోటగుట్ట దగ్గర ఉన్న నర్సరీకి ఆదివారం కంచెను ఏర్పాటు చేశారు. మొక్కల సంరక్షణ కోసం కంచెను ఏర్పాటు చేయడం పట్ల గ్రామంలోని రైతులు, ఉపాధి కూలీలు హర్షం వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ ద్వారా ఏర్పాటు చేసి కంచె ఏర్పాటులో నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక అధికారి నర్సింహ పలువురు రైతులు పాల్గొన్నారు.

కేసు నమోదు..

ఆత్మకూర్: గుడి గంటలు చోరీ చేసి తీసుకెళ్లిన సంఘటనలో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. శుక్రవారం ఆత్మకూర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో రూ.4 వేలు విలువచేసే గంటలు చోరీకి గురైనట్లు పూజారి రవిప్రకాష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

జీపీడీపీ ప్రణాళిక ద్వారా అభివృద్ధి పనులు

ఖిల్లాఘనపురం: జీపీడీపీ ప్రణాళిక ద్వారనే గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని అప్పారెడ్డిపల్లి పంచాయతీ కార్యదర్శి పృథ్వీకృష్ణ తెలిపారు. శనివారం మండలంలోని అప్పారెడ్డిపల్లి గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జీపీడీపీ ప్రణాళిక గురించి గ్రామస్తులకు వివరించారు. కేంద్ర ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరంలో గ్రామాల్లో చేపట్టవలిసిన అభివృద్ధి పనుల కోసం ప్రణాళికా సిద్ధం చేయాలని ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ ప్రణాళికలో 9 అంశాల్లో గ్రామాల్లో ముఖ్యమైన అంశం ఎంపిక చేసుకుని అభివృద్ధికి కృషిచేయడం జరుగుతుందన్నారు. గ్రామ మాజీ సర్పంచులు కృష్ణవేణి, నర్సింహారెడ్డి, నాయకులు కృష్ణయ్య, చెన్నయ్య, కృష్ణయ్య యాదవ్, లక్ష్మయ్య, మల్లేష్, మల్లేష్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బుద్దారంలో చోరీ

గోపాల్‌పేట: మండలంలోని బుద్దారం గ్రామంలో ఇంట్లో గుర్తు తెలియని దుండగులు రూ.25 వేలు అపహరించారు. ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాల మేరకు.. బుద్దారం గ్రామానికి చెందిన జూపల్లి నిరంజనమ్మ గ్రామంలో నివాసం ఉంటుంది. తన కుమారుడు హైదరాబాద్‌లో పోస్టాఫీస్‌లో పనిచేస్తున్నాడు. నవంబర్ 25న తన కోడలు డెలివరీ కావడంతో ఆమె హైదరాబాద్‌కు వెళ్లింది. ఐతే నిరంజనమ్మ ఇంట్లో పై అంతస్తులో కిరాయికి ఉండే వాజిద్ శనివారం ఫోన్ చేసి ఇంటి తాళం పగులగొట్టి ఉందని ఆమెకు సమాచారం అందించాడు. ఇంటి వచ్చి చూడగా రూ.25 వేలు చోరీ చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీం పరిశీలించి వివరాలు సేకరించామని ఎస్‌ఐ తెలిపారు.

నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధతీసుకోవాలి

ఖిల్లాఘనపురం: మండలంలోని ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామ నర్సరీల నిర్వహణపై ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీఓ వెంకటాచారి తెలిపారు. శనివారం మండలంలోని మానాజీపేట గ్రామంలో నర్సరీని ఆయన పరిశీలించారు. అనంతరం మల్కాపురంలో కుటుంబ సర్వేను పరిశీలించారు. మండలంలో చాలా గ్రామాల్లో సర్వే చివరి దశలో ఉందన్నారు. త్వరలోనే 100 శాతం పూర్తి అవుతుందన్నారు. పూర్తి అయిన గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులను ఆయా గ్రామాలకు పంపి వేగంగా చేయడం జరుగుతుందన్నారు.